

దెయ్యాలకొంప

పిశిపాటి వెంకటరమణయ్య

నా కప్పటికి పదేళ్లుండవచ్చు మా అమ్మ చనిపోయి. మా నాన్నగారు సాల్టు సబిన్సుపెక్టరుగా వుండి, యీవూ రావూరు క్యాంపులు వేసికొంటూ, తల్లిలేనిపిల్లవాణ్ణి పెట్టుకొని సంసారం నెగ్గలేక, దిక్కుదివాణంలేకుండా మనోవృత్తిజీవితంగడుపుకొంటున్న మా పెత్తల్లిని బ్రతిమాలి పట్నవాస కాపరం పెట్టించి చదువుకోసమని వదలేశారు నన్ను. మా పెత్తల్లిగారి గ్రామంకూడా అక్కడికి నాలుగైదుమైళ్ళ దూరంలోనే వుండేది. మొదటినుండి పల్లెటూరి బ్రతుకక్కలవాటుపడినామె గనుక, ఆ పట్నవాస కాపురం ఆమెకు తలకాయనొప్పిగా వుండేది. తల్లిలేనిపిల్లవాణ్ణని నామీద పంచప్రాణాలు వదల్తుండేది గనుక మానాన్నగారి కోరికప్రకారం వొప్పుకొంది. కాని, శుక్రవారం సాయంకాలము నేను స్కూలునుండి రావడమే తరువాయి వాళ్లపల్లెకు ప్రయాణంగట్టేది. మళ్లీ సోమవారంఉదయము అక్కణ్ణే భోంచేసికొని స్కూలువేళకంతా వూడిపడేవాళ్ళం.

ఆ పల్లెగూడా మహా ఆనందంగావుండేది. ఎక్కడ చూచినా తోటలు. ఊళ్ళోఅంతా బ్రహ్మాండమైన చెట్లు. ఏ మునిసిపాల్టీలు లేకుండానే సందుగొందులతో సహా పరిశుభ్రంగా ఊడ్చినట్లుండేవి. పల్లెనానుకొనే నది. తోటల్లో సమృద్ధిగా కూరగాయలుపండేవి. కావలసినంత పాడీ పంట. మునిపల్లెలావుండేది. బ్రాహ్మలిండ్లన్నీ ఓప్రక్క నుండేవి. ఎవరింట్లో ఏకార్యమొచ్చినా సరే అందరు వొకయింటివారయ్యేవారు. రెండో యింట్లో పొయిలో పిల్లి లేచేదికాదు.

నాకూ యీడూజోడూపిల్లలు ఆడుకోడానికి చాలామందుండేవారు గనుక ఆ పల్లెలో కాలంగడపడమంటే మహాసర్దాగావుండేది. ప్రొద్దున్నే చద్దన్నం వేళకు మేమెవరింటిదగ్గర ఆడుకొంటూచేరితే, ఆ యింటి పిల్లలతోపాటు ఇంత తరువాణీఅన్నం తినేసివచ్చేవాళ్ళమన్నమాటే. ఇలాంటివిందులు నాకు తరచు పార్వతమ్మగారింట్లో జరుగుతుండేవి. వీరింటివ్యవహారాలుగూడా చాలాతమాషాగానే వుండేవి. అసలా పల్లె మొత్తంమీదే బ్రాహ్మణకుటంబాలలో మగవాళ్లుతక్కువ, 'విడో' సెక్కువగ కనిపిచేవారు. గ్రహచారవశాత్తూ వయసుమీరింతరువాతకూడా బ్రతికివున్న ఏ సుబ్బయ్యగారివంటివాడో ఆవూరికంతా హీరో అన్నమాట. ఊరివ్యవహారాలంతా, లౌకికం కానీ వైదికం కానీ, వారి సలహా మీదనే జరిగిపోవలసినవే. మజరా గ్రామమవడంచేత కర్ణంగారికి మద్దతివ్వడానికి వాకిట వసారాఅరుగుమీద చిరిచాప పరుచుకొని ఏవో కాగితాలకట్టలు ముందరేసుకొని, ముందుకు తయారుకాబోయ్యే శిష్యుణ్ణి ప్రక్కనబెట్టుకొని కూర్చునేవారు. తాళ్లుకట్టిలాగి బిగించిన వెండి కళ్ళఅద్దాలగుండా వీథిలో యిటూ అటూ పోతూ

వుండే ఆడవాళ్లను హెచ్చరించుకుంటూ ఓయికిలింపు యికిలించేవాడు. "ఓహో ! చెంచా ! (చెంచమ్మ) ఏమిటే ఆవుపాడ పట్టకెళ్లుతున్నావా? ఏం సంగతి? యీవేళ యింత ప్రొద్దుపోయిం ది?" అని యిలాగే సగం సగం పేర్లతో పిలుస్తూ యికిలింపులతో హెచ్చరించేవాడు. ఆ పూర్వసువాసినికూడా సుబ్బయ్యగారి హెచ్చరింపు గౌరవసూచకంగా, కాస్త వెనక్కు తన్నేసిన ముసుగుతో, రెండుచేతులూ పేడవిగనుక, మణికట్టు



తో నెత్తి నదిమి ముసుకును ముందుకులాగి ముఖమందు మందహాసం కనిపించేది. ఇలాగే వచ్చే పొయ్యేవాళ్లతో వెర్రి ప్రశ్న. వాళ్లకు తగ్గట్టుగా భక్తి గౌరవాలసమాధానం.

ఇక మధ్యాహ్నం భోజనానంతరం వో గంట పడుకొని లేచి వొక్కొక్కరిండ్లకే బయలుదేరేవాడు. వాకిట వసారా అరుగుమీద చాపవేయించుకొని, ఆరోజు 'టాపిక్'నుబట్టి గంటో రెండు గంటలో కూర్చొని మంచీ చెడ్డా మాట్లాడి వెళ్లుతుండేవాడు. ఇదే ఆయాయింటివాండ్లకు గౌరవంగా భావిస్తూవుండేవారు.

ఓ సాయంకాలం పార్వతమ్మగారింట్లో నేనూ మహాలక్ష్మీ సుందరం యింకాకొంతమంది పిల్లలం ఆడుకొంటూ వున్నాము. ఇంతలోనే సుబ్బయ్యగారు వచ్చాడు. గబగబా పార్వతమ్మగారు మమ్మల నందరినీ కసిరి అవతలికి తరిమేసి, అరుగూడ్చి చిరిచాప పరిచింది. ఎందుకీకంగారంతా అని నేనలాగే నిల్చొని చూస్తూ వున్నా. మహాలక్ష్మి నాచెయ్యిపట్టుకొని 'రా ! బావా! పోదా' మన్నది. పెద్దమనిషి యింటికివచ్చి మాట్లాడుతూ వుంటే పిల్ల లల్లరిచెయ్యకుండా దూరంగాపోయి ఆడుకోవాలని నాకింకా అప్పటికి క్రొత్తగనుక తెలియలే.

'రా! బావా! పోదా'మన్నది.

అందుకనే అనుభవంవున్న మహాలక్ష్మి నాచెయిబట్టుకొని గుంజడం. ఇంతలోనే సుబ్బయ్యగారు "ఒసే! పార్వతీ! మహాలక్ష్మిని శేఖరానికిచ్చి పెండ్లి చేసేటట్టయితే బాగుంటుందే" అని మొదలుపెట్టా డారోజు 'టాపిక్'. ఈమాటవినడంతోటే నా కేమీచలనం కలుగలేదుకాని, నాచెయిపట్టుకొని గుంజుతూవున్న మహాలక్ష్మిమాత్రం

చప్పున నాచెయివదలేసి దూరంగావెళ్ళి తలవంచి సిగ్గుగా నిలుచుంది!

అరుగుమీదకూర్చున్న సుబ్బయ్యగారికి కనబడుతూ వుండేట్టుగా పార్వతమ్మ వాకిటితలుపు నానుకొని కూర్చుంది. ఈ పెండ్లి ప్రసంగం సుబ్బయ్యగారెత్తి మాట్లాడుతూవుంటే పార్వతమ్మగారి కూతురు రావమ్మగారు, కోడలు భాగీరదమ్మగారు నెత్తిముసుగులు సరిగా సవరించుకొని మెల్లగావచ్చి పార్వతమ్మగారిని చాటుచేసికొని కూర్చున్నారు. పార్వతమ్మగారు 'మరేలే, మనసంబంధం వాళ్లుచేసికొంటారూ. వాళ్ళంతా ఉద్యోగస్తులు, గొప్పవాళ్లు. మనం పల్లెటూరివాళ్లం' అంటూ మనకు వద్దవారు మనకూ దొరకుతారనే బిగువుతో పెదివెవిరుస్తూ, కండ్లారుస్తూ గడ్డానికి చెయ్యి మోపి కొంచం ముందుకువాలి కూర్చుంది

సుబ్బ—ఇదేమన్న మాటలే. పట్నవాసంవాళ్లూ, ఉద్యోగస్తులూ పల్లెటూరిపిల్లలను చేసికోరని యెక్కడన్నా వుందాయేమిటి? అంతదూరమెందుకు? వాళ్లమ్మపల్లెటూర్దేఅవునంటావా కాదంటావా. వాళ్లనాయన చేసికోలా?

పార్వ—అదేకాదులే. వాళ్లకుకట్నాలు-కానుకలు వాళ్లహోదాకు తగ్గట్టు మన మేమివ్వగలము? ఏదో యింతపులుసుకూరా అన్నంపెట్టి చేసేవాళ్లమేకాని.

సుబ్బ—ఏమంత మునిగిపోయింది? మీకుమాత్రం ఏ పదిమంది పిల్లలున్నారని. రాముకెట్లాగో (కూతురికి) కొవరూ దిక్కులేరయిపోయె. దాని యెనిమిదెకరాలూ యిచ్చి పిల్లనిస్తామంటేకండ్లద్దుకొంటూ చేసికొంటారు. కోడలిని కొడుకునూ పెట్టుకొని సుఖంగా వుండవచ్చు. రాముకుమాత్రం యింతకన్నా కావలసిందేముంది? సుందిగాడికి (మనవడికి) ఆ ఆస్తి కావలెనని యేమీ లేదు కదా? వాడికి కావలసినంత తిని ఒకరికింత పెట్టగలిగిన ఆస్తేవుందయిపోయె.

ఈ మాటలు వినేటప్పటికి, అప్పుడే మనవడికి కలిసివచ్చిన ఆ యెనిమిదెకరాలు ఎగిరిపోయినట్టే గుండెలు కొట్టుకో మొదలుపెట్టినవి పార్వతమ్మకు! పైకేమీ కనిపించకుండా "సరేలే, మన మెన్నుకొంటే యేం లాభం దైవంకూర్చివుండాలి కదా?" అని ఆప్రసంగం జారవిడిచింది.

రావమ్మగారికేమోగాని మొదటినుండి నన్నుచూస్తే విపరీతమైన ప్రేమవుండేది. ఆమెకైనా పాతిక ముప్పైయేళ్ళలో వుంటాయేమో? తలచెడింపన్నమాటే కాని బంగారంలాంటి విగ్రహం. మహాలక్ష్మికి తలదువ్వి జడవెయ్యగానే నాక్రాపుగూడ దువ్వేది. నీళ్లుపోసేది. అన్నంకూడ మహాలక్ష్మి, సుందరాలతోటిపాటు వాండ్లింట్లోనే తినమని బలవంతంచేసేది. గడ్డంక్రిందికి చెయిబెట్టి రెండుబుగ్గలుగట్టిగానొక్కిపట్టుకొని నాముఖం పైకెత్తి వంగి నన్నుతరుచుగట్టిగా ముద్దుపెట్టుకొంటూ 'నా చిలకతండ్రి నా బంగారునాయన, నా శేఖరం'అని ఎలిపివేస్తుండేది. శుక్రవారం సాయంకాలం నేనూ మా పెత్తల్లీ పల్లెకుచేరుకొనే సమయానికంతా వాకిట్లో నిల్చొని యెదురుచూస్తూ వుండేవారు. సెలవరెండు రోజులూ (శని ఆదివారాలు) వాండ్లింట్లోనే సరిపొయ్యేదన్నమాట నాకు. మాపెత్తల్లికెందుచేతనో వాండ్లు నన్నంత చనువుచెయ్యడం గిట్టేదికాదు. అయినా ఏమో తల్లిలేనిపిల్లవాడినని నాసరదాకేమీ అడ్డుతగిలేదికాదు. అప్పటికి నాకుమహావుంటే పన్నెండు పదమూడేండ్లుండవచ్చు. మహాలక్ష్మికీ వొకటిరెండు తక్కువుండవచ్చు. కాని, పల్లెటూరిపిల్ల. వెన్నమీగడలతో మెరుగుబోసిన బంగారుబొమ్మ. నాకన్నా మంచి దిటవుగా వుండేది. ఆటపాటల్లో తోటిమగపిల్లలమగు మమ్మలనందరినీ త్రోసిరాజనేది. గోలికాయలు మొదలుకొని గోటిబిళ్ళదాకా ఝుమాయించి ఆడేది! చెట్టెక్కడంవస్తే నేనుమిటకరించుకొనిచూస్తూచూస్తూవుండగానే చిటారుకొమ్మకెక్కి కూర్చునేది. నేనెక్కలేక తంటాలు పడుతుంటే ఓకొమ్మమీద కూర్చొని క్రింది కొమ్మను కాళ్లకూతగాజేసికొని రెండుచేతులూ వదిలేసి విరగబడినవ్వేది.

ఓమారు ఊళ్లో అందరూ మాఘస్నానాలకని బయలుదేరుతుంటే "నీవుకూడారా బావా పోదాం"అని పిలిచింది మహాలక్ష్మి. మాట తోసెయ్యలేక నేనూబయ

ద్దేరా. చలి భరింపలేకుండావుంది. తీరా అందాకా వెళ్లి స్నానంవద్దూ పానంవద్దూ అని గట్టిగాముసుగుబెట్టుకొని, నీటివొడ్డునున్న ఓ రాయుంటే దానిమీద కూర్చొని స్నానం చేస్తూవున్నవాళ్లందర్నీ చూస్తూవున్నా - మహాలక్ష్మి నాకుదగ్గరగా కంఠంలోతు నీళ్లల్లో మునుగుతూ తేల్తూ నవ్వుతూ తుళ్లుతూ "స్నానంచెయి బావా చలుండదు. ముడుక్కొని కూర్చుంటే అట్లాగేవుంటుంది" అని పిలిచింది. "వద్దబ్బా నాకు చెడ్డచలేస్తున్నాది" అని మరీగట్టిగాముడుక్కొని వూగుతూ కూర్చున్నా. ఈమాట అనీఅనడంతోటే మహాలక్ష్మి అమాంతం నన్నుబట్టి నీళ్లలోకీడ్చింది. నాకు తలమునకలయింది. ఒక బుటకేసి యిన్నినీళ్లుకూడా మింగా. ముక్కులోనూ, నోట్లోనూ నీళ్లుపోయి నేను ఉక్కిరిబిక్కిరవుతుంటే నా అవస్థచూచి మహాలక్ష్మి పకపకా నవ్వను మొదలుపెట్టింది. పక్కనేవున్న భాగీరదమ్మ (తల్లి) రావమ్మ (మేనత్త) మహాలక్ష్మిని కూకలేశారు. కాస్తదూరంనుంచీ చూస్తూవున్న మాపెత్తల్లి "వట్టి గయ్యాళిపిల్ల" అనుకొంది కాబోలు మహాలక్ష్మి కేసి చురచురచూచింది. అప్పట్లో యీ 'చురచుర' లన్నీ మహాలక్ష్మి కోలెక్కలోకే వచ్చేవికావు.

ఈ ఆటపాటలలో ఒకటిరెండేండ్లు గడచిపోయినవి. ఇలావుండగానే, సుబ్బయ్యగారు వివాహప్రశంస తెచ్చింది. ఈ ప్రశంస వచ్చిందేమొదలు రావమ్మగారికి నాపైన వెర్రిప్రేమకలగడం, మహాలక్ష్మి నాతో కొంటెచేష్టలుచెయ్యడం మానివెయ్యడం తటస్థించడం. పైగా మహాలక్ష్మి నన్నుచూస్తే సిగ్గుకూడా అభినయిస్తూ వుండేది. ఇంతట్లోకే మాకు వేసవిసెలవలుకూడా వచ్చాయి. ఒక్కపట్టున మూడుమాసాలు. మహాలక్ష్మిని ముస్తాబాచేసి, నాజూటన తిరిగేట్టు చేసినా వెర్రివెర్రిగా మాట్లాడవద్దనీ, పిచ్చిపిచ్చిగా గంతులెయ్యవద్దనీ యేమేమో నీతులు చాటుమాటుగా బోధిస్తూకూడా వుండేవారు. ఈకట్టుదిట్టాలెందుకో నాకేమీ అర్థమయ్యేవేకావు. పైగా నాకుమాత్రం మహాలక్ష్మి నిట్లాంటి కట్టుదిట్టాలలో వుంచడంచేత పూర్వంరీతితరుచునాండ్లింట్లో కాలం గడపడం అంత ఉత్సాహంగా వుండేదికాదు. ఒక్కోరోజు బొత్తిగా వాండ్లింటికి వెళ్లడమే మానేసేవాడిని. నేను వాండ్లింటికివెళ్లడం తగ్గించినతరువాత మహాలక్ష్మే మాయింటికి అప్పుడప్పుడు రావడం మొదలుపెట్టింది. ఒంటరిగా పనిచేసికొంటూవుండే మాపెత్తల్లిగారికి కాస్తసహాయంకూడా చేస్తూవుండేది. ఆ అల్లరికొంటెచేష్టలుమాని యింతబుద్ధిమంతురాలైనదని మాపెత్తల్లిగారికికూడా ఆశ్చర్యంగావుండేది. "అమ్మాయ్, యీరోజు నీవుకూడ మీబావతో యిక్కడే భోజనం చెయ్యి" అని కూడ అడిగేది. నేభోజనంచేసినతరువాత ఆలేతచేతుల్తో నా యెంగిలెత్తి శుద్ధిపెట్టేది. మైలపనులన్నీచేస్తూ ఆమెను సంతోషపెట్టేది. మహాలక్ష్మికి వాండ్లింట్లో యిటుచెంబటుపెట్టేఅగత్యమే వుండేదికాదు. ఎంతో గారాబంగా, ఏమైనాపనిచేస్తే అరిగిపోతుందన్నట్టుగా చూచుకొనేవారుకూడ. అలాంటప్పుడు మాపెత్తల్లిగారి కన్ని పనులు చేసిపెడుతున్నట్టు తెలిసికూడ వాండ్లవ్వ తల్లి మేనత్తా యేమీ మాట్లాడేవారుకారు.

అసలందాకావస్తే నా పెండ్లివిషయమై జోక్యం కలిగించుకోడానికి మాపెత్తల్లికేమీ అవకాశముండదని లోలోపల ఆమెకూ తెలుసు. అయినా అప్రయత్నంగా వచ్చిపడుతూవున్న యీగౌరవాన్నెందుకు పోగొట్టుకోవడమనుకొనేదో యేమో మహాలక్ష్మిచేయగలిగిన చిన్నచిన్నపనులన్నీ సగర్వంగానే చేయించుకొనేది. ఇన్నాళ్లూ పాపం మాపెత్తల్లికిదొరికే చాలీచాలని భరణంతో ఆపల్లెలో జీవితం వెళ్లబుచ్చుకొంటుంటే అడిగేవాళ్లెవరూ వుండేవాళ్లేకారు. పైగా కాస్తదూరబంధువులు మంచిభూస్థితిగలిగిన పార్వతమ్మగారికుటుంబమువారికి 'ఖాతరే' వుండేదికాదు. ఇప్పుడు ఖాతరుచెయ్యడమేకాదు కాస్తభయంగాకూడా సంచరిస్తుండేవారు. మహాలక్ష్మిని నాకిచ్చి వివాహంచేసేయత్నాలలో మాపెత్తల్లిగా రడ్డుకగుల్తారేమోననే యీ భయమంతా వారికి! మాపెత్తల్లిగారికికూడా యీ గౌరవమంతా నావంటి కొడుకుండబట్టేనని ఆమెభ్రమ!

మహాలక్ష్మి పూర్వంమాదిరి ఆటపాటల్లోనేమి, మాటముచ్చటలోనేమి విజృంభించడం మానేసి కొంచమెడ

మెడంగా తిరగడం మొదలుపెట్టినంచీ ఎందుచేతనో ఆకర్షణెక్కువయింది. ఒంటరిపాటున వారచూపులు చూచేది! మీదబడి క్రిందబడి గుంజుకొని కొట్టుకొని ఆడుకొనేరోజుల్లో యేచైతన్య ముండేదికాదు. ఈ దూరంనుండి ప్రయోగించెడి వారచూపుల దెబ్బమాత్రం మహాగాబరాయెత్తించేది! ఎవరైనా వింటారేమోనని జంకుతూ వొంటి:పాటుగా ఈ వేళిక్కడనే భోంచేస్తా ముండుబావా" అని దీనంగావేడుకొనే ఆలాపం హృదయాన్ని కలచివైచేది! ఇదివరలో ఆటలలో మొండికిబడి కూర్చుంటే, లేవనెత్తడానికి మీదబడి రెండుచేతులతో తనువు నమాంతం కౌగలించుకొంటే యేమీ అనిపించేదికాకపోయినా, దూరదూరంగా సంచరిస్తూవచ్చిన యిటీవల ఏ సందర్భంలోనన్నా తాకడం సందర్భిస్తే వొళ్లుఝల్లుమనేది!

ఇలా కొన్నాళ్లుజరిగినది. ఆరోజుకారోజు నేనెందుకో చిక్కిపోతున్నట్లు మాపెత్తల్లి కనిపెట్టింది. చివరకామెవచ్చిన పర్యవసాన మేమంటే అనాదినుండి రావమ్మగారింటిని కొన్ని ఆడదయ్యాలు ఆశ్రయించుకొనియున్నాయని, మొగవాళ్లను చంపుకతింటాయని వివాహాల నసలే సహింపవని! తనెరిగియున్న మూడు తరాలనుండి రావమ్మగారు కాపరానికివచ్చిన సంవత్సరానికే మొగుణ్ణి చంపేశాయట. కోడలింటికివచ్చిన ఆరుమాసాలకే కొడుకు చచ్చాడట. కూతురిపెండ్లయి పదహారుదినముల పండక్కు అల్లుడింటికివచ్చిన మూడోరోజునే 'హరి' అన్నాడట. ఇహనిప్పుడు మహాలక్షిని నాకిచ్చి వివాహము చెయ్యవలయునని వాండ్లు పడుతున్న విశ్వప్రయత్నాలను కనిపెట్టి ఆదయ్యాలు నావెంటబడ్డాయని నిశ్చయించుకొంది! అందుకనే రాత్రిళ్లు నన్ను వాండ్లింట్లో పడుకోవద్దని నెత్తిననోరు పెట్టుకొని కొట్టుకొంటున్నా వినాన్నుకానని గోల పెట్టింది. ఇదివర్లో ఎంతో తెలివిగా చదివేవాణ్ణని స్కూల్లో టీచర్లందరూ మెచ్చుకొంటూవుంటే యిప్పుడు పరీక్షలు ఫెయిలుచేయిస్తూవున్నవి కూడా ఆదయ్యాలే అని తెలిసికొంది! తనకెంతకష్టంగావున్నా నాకొరకు ఆపల్లెకు వెళ్లడమే మానేసి నన్ను పెట్టుకొని పట్నంలోనేవుండిపోయింది. అప్పుడప్పుడూ నేను సెలవలలో వెళ్లివద్దామని రమ్మంటే ఆ దయ్యాలే యిక్కడికివచ్చినా వదలకుండా వెంటబడ్డాయని నన్నేమీ అనకుండా ఆదయ్యాలను తిట్టిపోస్తుండేది! ఒకరిద్దరు భూతవైద్యులనుగూడ పిలిపించి భూతోపశమనం చేయించిందనికూడ జ్ఞాపకం.

పాపం! మహాలక్షిని నాకిచ్చి వివాహంచెయ్యవలెనని వాండ్లు విశ్వప్రయత్నాలు చేశారు. రావమ్మగారు తన యెనిమిదెకరాలుయివ్వడమేగాకుండా జీవితపర్యంతము దాస్యంచెయ్యడానికికూడ సంసిద్ధురాలై యున్నట్టు మానాన్నగారికి తెలియజేశారు. అన్నివిధాలా అనుకూలమైన సంబంధమేనని మానాన్నగారు కూడ మొగ్గారు. కాని మాపెత్తల్లిగారు ఎక్కడన్నా దూరంగాపోయి బ్రతుకుతామన్నా ఈ పెండ్లిపేరుబెట్టి ఆ దయ్యాలను నామీద ఉసిగొల్పి నా అంతంచూడటానికే రావమ్మగారి కుటుంబం పగబూనిందని, ఆ దయ్యాలను హతమార్చడానికి రాక్షసరూపం దాల్చింది. మానాన్నగారి మనసు త్రిప్పేసింది. ఇంకను బ్రతిమాలడము ఆత్మగౌరవానికి లోపమని మహాలక్షికి వేరే సంబంధం మాట్లాడారు. వివాహం జరిపించారు.



"బావా! నన్నన్యాయం చేశావుగదా?......"

అదేమి కర్మమోగాని ఏడాది తిరక్కముసుపే మహాలక్షికి వైధవ్యం సంప్రాప్తించినది! "హమ్మ! బ్రతికామురా దేవుడా! దయ్యాలకుతగిన ఆహుతి దొరికింది. ఇంకవి మాపిల్లవాడిని పట్టుక బాధింపవు" అనుకొని మాపెత్తల్లి సుఖంగా నిద్రపోతూవచ్చింది!!

పాపం మహాలక్షిని యిప్పుడుకూడా ఎప్పుడైనా చూడటం తటస్థించితే "బావా! నన్నన్యాయం చేశావుగదా?" అని కాల్వలైగట్టు కంటిధారల తన పవిటకొంగుతో అద్దుకొంటూ గద్గదికంగా అంటుంది.

జెనిత్ ద్రాక్షాసవ

ఆయుర్వేద శాస్త్రీయ పద్ధతులమీద తయారు కాబడినది

ఆరంభదశలో నున్న క్షయరోగము, ఉబ్బసము, శ్వాసనాళీద్రాహము, ఊపిరితిత్తులకు సంబంధించిన యితర వ్యాధులు, శీతలము, పడిసెము, మందాగ్ని, అజీర్తి, మలబద్ధకము, కడుపు పులియుట, వాంతులు వచ్చునట్లుండుట అన్నివిధములగు గొంతువ్యాధులు మున్నగు జాడ్యములను ఇది పూర్తిగా కుదుర్చును. పిల్లలదగ్గులను పోగొట్టుటలో అద్వితీయ మైనది. త్రాగుటకు మధురముగా నుండును. క్రమముగా సేవించినచో, ప్రేగులను శుభ్రముగా నుంచి, ఆకలిని వృద్ధిజేయును. జెనీత్ ద్రాక్షాసవమును రాత్రివేళ పరుండక మునుపు పుచ్చుకొనిన సుఖనిద్ర నిచ్చును. ఉదయమున మేల్కాంచినంతనే తమపనులయందు దాసక్తులై చురుకుగా నుందురు.

"జెనిత్ ద్రాక్షాసవము" ఇప్పుడు ప్రతినగరములోను, పల్లెలందును గల దుకాణములలో దొరకును. తపాల ద్వారా సీసాల నంపుటచే మిగుల వ్యయ మగును గాన మా ఖాతాదార్లు వారిగ్రామములో గల దుకాణములందే "జెనిత్" ద్రాక్షాసవమును కొనినచో వీలుగా నుండుటేకాక లాభకరముగాగూడ నుండును.

వెల $1\frac{1}{2}$ పౌను రు. 1-12-0. 1 పౌను రు. 1-4-0. $\frac{1}{2}$ పౌను రు. 0-12-0. ప్యాకింగ్ వి. పి. ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రజిల్లాల యేజంట్లు:—
ఉపేంద్ర అండు కో., గుంటూరు.

Zenith Chemical Works,
Dekaran mansions, Princess St., Bombay No. 2.